# అనుభూతికి ఆవలి ఒడ్డు

ఐ.వి.జైన్వచందర్




"ఎక్స్క్యూజ్ మీ. నా సోడా ఖర్చిస్తారా?

ఐ మీన్...మీ డబ్బులతోనే."

తనని ఎంతో సహజంగా, స్నేహపూర్వకంగా అడుగుతున్న ఆ వ్యక్తిని చూసి తాగుతున్న కూల్ డ్రింక్ సగంలో ఆపి కొట్టువాడి నడిగి ఫ్రిజ్ లోంచి తీసిన మరో కూల్‌డ్రింక్ బాటిల్‌ని ఆ యువకునికి అందించి, ఆ చేత్తోనే భుజానికున్న వేనిటీబాగ్‌ని మరో భుజానికి మార్చుకుంటూ అతి మామూలుగా ఆ యువకుని చూపులతో తడిమింది ప్రభ.

మనిషి ఐదడుగుల ఆరంగుళాల పొడవుతో బక్కపలచని దేహం. మట్టి కొట్టుకు పోయిన పేంట్—దానిపై రంగు వెలిసిన గీతల చొక్కా. అక్కడక్కడ రెండు మూడు చోట్ల చిన్న చిన్న చిరుగులు. బాగా మాసిన గడ్డం. లోతుకు పోయిన కళ్ళలో చురుకుదనం. మెరుపుదనం కోల్పోని చూపులు. తైల సంస్కారం లేక నిర్లక్ష్యంగా వదిలేసిన నొక్కుల జుత్తు. చేతిలో ఏదో పాత ఫైల్.

ప్రభ చూపుల్ని గాని, ఆ చూపుల్లో తొణికిస లాడుతున్న భావాన్ని గాని పట్టించుకోకుండా "థాంక్స్ మేడం" అంటూనే ఆమె చేతిలోని బాటిల్‌ని అందుకుని ఆత్రంగా గడగడ ఊపిరి తీసుకోకుండా ఒక్క ఉదుటులో తాగేసి ఖాళీ బాటిల్‌ని ఆమె కందించి "థాంక్స్ వన్స్ ఎగైన్, మేడం" అని ఆమె సహాయానికి మరోమారు కృతజ్ఞతలు తెలిపి చొక్కా అంచుతో పెదవుల్ని, పెదవులతో పాటు మొహాన్ని ఒకసారి తుడుచుకుంటూ ఉష్ మని భారంగా నిట్టూర్చి "అడిగిన దానికంటే ఎక్కువే అందించిన మీ ఔదార్యానికి కృతజ్ఞుణ్ణి మేడం. మీ దయ వలన ఇంటర్వ్యూ ఆఫీసర్లని అదరగొట్టే శక్తి వచ్చేసింది. నా స్పీడ్‌కి తట్టుకోలేక ఒక్క ఆఫీసరైనా గుండె ఆగి చావకపోతే నా పేరు మార్చేసుకుంటాను. అలా చూస్తారేమిటండీ! నిజం. మీ తోడు—అహఁ వద్దులెండి. నా తోడు."

"మీరుకూడా ఈ ఇంటర్వ్యూకే వచ్చారా?!" చిన్నగా నవ్వుతూ అతని వాక్ప్రవాహానికి మధ్యలో అడ్డు తగులుతూ ప్రశ్నించింది ప్రభ.

"ఎస్, ఎస్. మీరుకూడా ఈ నిరుద్యోగ సంఘంలో సభ్యులా?"

"అబ్బే! అంత అదృష్టం లేదులెండి." వేనిటీబాగ్ తెరిచి ఒక నోట్ కొట్టు వాడి కందించి చిల్లర తిరిగి తీసుకుని బేగ్‌లో పడేసి రుమాలుతో పెదవుల తడినద్ది "నా ఫ్రెండ్ గుంటూరునుండి ఇంటర్వ్యూకని వచ్చింది. దానికి ఈ వూరు కొత్త. అందుకని దానికి తోడుగా నేనుకూడా రావలసి వచ్చింది" అంది ప్రభ.

అలా ఇద్దరూ మాట్లాడుకుంటూ కిళ్ళీ బడ్డీ నుండి కొంత దూరం వరకు వచ్చారు.

"ఆఁ! చూడండి, మేడం మరి కొన్ని విషయాల కోసం మీ పరిచయాన్ని నే ఆశించటం మీకు అభ్యంతరం అంటారా?" చురుకుగా అడిగాడా యువకుడు.

"అదేం కాదు." చిన్నగా నవ్వింది ప్రభ.

"నా పేరు ప్రభ. ఎ. ఎస్. ప్రభ. ఇంట్లో అంతా స్వయంప్రభ అని పిలుస్తారు. బయట మిత్రులు స్మృతి ప్రభ అని పిలుస్తారు. మీరు ఎలా పిలిచినా అభ్యంతరం లేదు. నాకు వివాహం ఇంకా కాలేదు. ఉద్యోగం మాత్రం ఉంది, ఒక ప్రైవేట్ ఫర్మ్‌లో. ఇంతకంటె నా వివరాలు చెప్పుకోదగ్గవేమీ లేవు. మే ఐ నో యువర్ గుడ్ నేమ్!"

"ఎస్, ప్లీజ్! అడిగారు కనక చెప్పక తప్పదు. మనోజ్‌గా గుర్తింపబడ్డ నేను ఒక గ్రాడ్యుయేట్ అయ్యుండీకూడా ఇంకా రోడ్డు పట్టుకు తిరుగుతున్నానంటే. ఇదంతా ప్రభుత్వం సాధించిన ఘనవిజయాల ఫలితమే కావచ్చు. ఇందాక మీ రన్న నా అదృష్టంకూడా ఇదే కావచ్చు. ఇకపోతే చదివింది జువాలజీ సబ్జెక్ట్ అయినప్పటికీ ఆర్ట్స్‌తోపాటు సైన్స్‌ని ఇంకా జనరల్ నాలెడ్జి అనబడే అడ్డమైన విషయాల్ని ఈ చిన్న బ్రెయిన్‌లో ఇరికిస్తూ ఉద్యోగం కోసం అన్వేషిస్తున్న నిరుద్యోగిని. అతిగా వాగటం నా కున్న అదర్ క్వాలిఫికేషన్స్‌లో ఒకటి. ప్రభగారూ! మనల్ని అదరగొట్టేస్తున్న ఈ వెన్నెల్లో నుండి ఆ చెట్ల నీడల్లోకి నడిస్తే బాగుంటుం దంటాను. లేకపోతే మరి కొద్ది సేపట్లోనే స్పృహ తప్పటం ఖాయం. ఆ తరవాత మళ్ళీ సోడా ఖర్చు

